## క్లుప్తంగా

### కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో వెంకటరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అరవింద్

**మిడుతూరు:** చౌట్కూరు గ్రామ సచివాలయ పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన కమతం వెంకటరెడ్డి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అరవింద్ గవర్నమెంట్ శనివారం హాస్పిటల్‌కు చేరుకొని పింఛన్ అందజేశాడు.

**84 శాతం పింఛన్ కానుక పంపిణీ**

**కొత్తపల్లి:** మండలంలో జూలై నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీని గ్రామ వలంటీర్లు 84 శాతం పూర్తి చేశారని ఎంపీడీఓ మేరి తెలిపారు. మండలంలో మొత్తం 4,173 మంది లబ్ధిదారులు ఉండ గా అందులో 3508 మందికి నగదు అందించడంతో 84 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యిందన్నారు.

**మహానందిలో 87.91శాతం**

**మహానంది:** మహానంది మండలంలో శనివారం 87.91 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మండలంలో మొత్తం 5,155 పింఛన్లు ఉండగా 4,532 పంపిణీ చేశామన్నారు.

### శనగల బసవన్నకు పూజలు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరస్వామికి శనివారం త్రయోదశి సందర్భంగా శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను చేపట్టారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

### వస్తు సేవల పన్ను దినోత్సవం


**శ్రీశైలంప్రాజెక్ట్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ వస్తు సేవల పన్ను దినోత్సవాన్ని నిర్వహించారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎమ్ బుచ్చయ్య, అధ్యాపకులు ఉన్నూరు సాహెబ్, ఎస్‌కే షాహిదాబేగంలు జీఎస్‌టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో జీఎస్‌టీ పన్ను విధానాన్ని అమలు చేయడం వలన ఆర్థికాభివృద్ధి పురోగామిగా ఉందన్నారు.

### అనుమానాస్పదంగా కారు



**ఆత్మకూరు రూరల్:** మండలంలోని నల్లకాల్వ గ్రామ సమీపంలోని జమ్ములమ్మ ఆలయం ఎదుట నాలుగు రోజులుగా ఒక కారు పార్క్ చేయబడి అనుమానాస్పదంగా కనిపించింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం కారును ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెల్లటి కియా కారు రెండు కిటికీ అద్దాలు పగలగొట్టబడి ఉండడం, కారు నంబర్ ప్లేట్లు రెండు లేకుండా ఉండడం వంటి పలు అంశాలు అనుమానాస్పదంగా ఉన్నాయి. పోలీసులు కారు వివరాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

### ప్రజలకు వైద్యం చేయడమే లక్ష్యం



కేక్‌కట్ చేస్తున్న వైద్యులు

**ఆత్మకూరు:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యం అని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు వెంకటరమణ, ఓబులేసు, నాగరాజు, రాయుడు, ఇలియాజ్, ప్రసన్న లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం డాక్టర్స్ డే నిర్వహించారు. కేక్‌కట్ చేసి, పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

**పాములపాడు:** స్థానిక ఏపీ మోడల్ స్కూలులో 7,8,9 తరగతుల ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నాగరవీంద్ర తెలిపారు. పాఠశాలలో ఆయా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 7వ తరగతి 28, 8వ తరగతి 36, 9వ తరగతి 25 చొప్పున విద్యార్థుల నుంచి ప్రవేశానికి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఉదయం 9గంటలకు పరీక్ష ఉంటుందని వివరించారు.

### సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి

**ఆత్మకూరు:** రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి రజాక్ కోరారు. శనివారం సుదర్శన వర్మ భవనంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పక్కాగృహాలు, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అట్టహాసంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం



అబ్దుల్లాపురం గ్రామంలోలబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

**వెలుగోడు:** ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శనివారం అబ్దుల్లాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామంలో 158 మంది దరఖాస్తు చేసుకోగా 152 వినతులకు పరిష్కారం చూపారు. మిగతా ఆరుగురికి సెల్ నంబర్‌కు ఆధార్ లింక్ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రాష్ట్రంలో 99 శాతం మందికి ఇప్పటికే పథకాలు అందాయన్నారు. మిగిలిన ఒక్క శాతం వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో మేలు చేస్తున్నామని చెప్పారు.

**ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు**

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అబ్దుల్లాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో షేక్ అమానుల్లా, తహసీల్దార్ నారాయణరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, మండల అధ్యక్షుడు అంబా ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, కే.రామ్మోహన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రమణ, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష తో ప్రజలకు మరింత చేరువ**

**ఆత్మకూరురూరల్:** జగనన్న సురక్ష కార్యక్రమంతో సేవా కార్యక్రమాలను మరింత చేరువగా ప్రజల వద్దకు తీసుకు పోగలుగుతున్నామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. ఆత్మకూరు మండలంలోని బాపనంతాపురం గ్రామంలో శనివారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు హాజరైన ఎంఎల్‌సీ ఇషాక్ బాషా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో 214 మంది దరఖాస్తులు చేసుకోగా 195 మందికి అక్కడికక్కడే ధ్రువపత్రాలు అందజేశారు. ఇంకో 19 మందికి ఆర్‌డీఓ ధ్రువీకరణ అవసరం కావడంతో వాటిని ఆర్‌డీఓ కార్యాలయానికి ఫార్వర్డ్ చేశారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ జి.శంకరరెడ్డి, ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, ఎంపీటీసీ శాంతమ్మ, సర్పంచ్ దరగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండల్‌రావు, రాజేష్,శివరామ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో పార్టీ నాయకులు పువ్వాడి భాస్కర్ ఎమ్మెల్యే చేత భారీ కేక్ కట్ చేయించి కార్యకర్తలతో బాణాసంచా కాల్పించారు.

**అర్హులందరికీ పథకాలు..**

**ఆత్మకూరు:** అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలో రహమత్‌నగర్, ఇందిరానగర్ సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులో నిరుపేదలకు సెంటున్నర స్థలం ఇవ్వడమే కాకుండా మంచినీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు లాంటి అభివృద్ధి పనులు చేయించి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

**ఆత్మకూరులో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు**

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్, శేషు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పార్టీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, వార్డు కౌన్సిలర్లు , పార్టీ నాయకులు బైరాపురం మహబూబ్‌బాషా, మునీర్‌బాష పాల్గొన్నారు.

**జగనన్న సేవలు దేశానికి ఆదర్శం**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్, రహమత్‌నగర్ కాలనీల్లో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, అహ్మద్‌రసూల్,రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**జీలుగ, కంది విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

మండలంలోని బాపనంతపురం గ్రామంలో శనివారం రైతులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సబ్సిడీపై కంది, జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏడీఏ అంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో..**

**మహానంది:** మహానంది మండలం బొల్లవరం, బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. మహానంది మండలంలో 121 మందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 123, ఆధార్ సమస్యలు 38 తీర్చారు. బండిఆత్మకూరు మండలంలో 246 ఆదాయ, 236 కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు.



బాపనంతాపురంలో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఎంఎల్‌సీ ఇషాక్ బాషా



ఆత్మకూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్



ఆత్మకూరులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

కార్యక్రమాల్లో తహసీల్దార్ రవికుమార్, డీటీ శ్రీనివాసులు, ఎంపీడీఓ వాసుదేవగుప్త, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, సర్పంచులు జమాల్‌బీ, మన్నె జ్ఞానాభరణం, వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, బొల్లవరం మాజీ సర్పంచ్ బండి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేందుకే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- అన్ని మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం
- లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాల పంపిణీ



నందికొట్కూరులో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

**నందికొట్కూరు:** ప్రజల సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరిచేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శనివారం పట్టణంలోని బ్రహ్మంగారి మఠం సమీపంలోని రెండో సచివాలయం పరిధిలో జగనన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైనవారిలో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని చెప్పారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా కుల, ఆదాయ, మ్యారేజ్, ముటేషన్, నూతన రేషన్‌కార్డు మంజూరు, రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, స్ప్లిట్టింగ్, మొబైల్–ఆధార్ నెంబర్ల లింకప్ వంటి 11రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి సేవా రుసుము లేకుండా అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ కిషోర్, మేనేజర్ మంజునాథ్ గౌడు, టౌన్ సీఐ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య, కౌన్సిలర్లు జాకీర్, ధర్మారెడ్డి, ఎస్ఐ ఎన్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం**

అర్హులందరికీ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఏబీఎం పాలెంలో 1వ సచివాలయం, బ్రహ్మంగారి మఠం వద్ద ఉన్న 2వ సచివాలయాల్లో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, మేనేజర్ మంజునాథ్‌గౌడు, కౌన్సిలర్లు చిన్నరాజు, చాంద్‌బాషా, ఆర్ఐలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. 1వ సచివాలయంలో 221, సచివాలయం –2లో 148 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

**మిడుతూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై మిడుతూరు –1 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న పవేశపెట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయంటూ మాట్లాడిన ప్రాతకోట పుల్లయ్యను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఈఓఆర్డీ ఫకృద్దీన్, ఏఓ పీరునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్, ఎస్ఐ మారుతిశంకర్, కిసాన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, సీనియర్ నాయకులు సల్కోటి గోవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, సీతారాముడు, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా ఉదయం జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి , ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ సర్పంచ్ జయలక్ష్మమ్మ, మండల ఉపాధ్యక్షులు నబీరసూల్, పీరుసాహెబ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, నాయకులు మల్లు శివ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

**కొత్తపల్లి:** మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో ఎంపీడీఓ మేరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో 234 మందికి అవసరమైన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రఘురామ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎండీ.రఫి, సాయిరాం, అయ్యపురెడ్డి, రమేష్, ఈశ్వర్, ఆర్‌ఎంపీ రాము, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

**దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**పాములపాడు:** ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేరుస్తూ, ప్రతి ఒక్కరి శ్రేయస్సే లక్ష్యంగా పాలన సాగిస్తూ, సంక్షేమ పథకాల అమలుతో ప్రతి పక్షాలకు ముచ్చెమటలు పట్టిస్తున్న దమ్మున్న నాయకుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 177 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వర్జీనియమ్మ, సర్పంచు అఖ్తరున్నిసా, ఎంపీటీసీ బషీరాహ్మద్, నియోకవర్గం ప్రత్యేకాధికారి రఘురాం, ఆర్డీఓ దాసు, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఏపీ టూరిజం డైరెక్టర్ లక్ష్మిదేవి, కో ఆప్టెడ్‌సభ్యుడు ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

**తర్తూరులో 523 మందికి సేవలు**

**జూపాడుబంగ్లా:** మండలంలోని తర్తూరు గ్రామంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొన్నారు. తర్తూరు గ్రామంలో 563 టోకెన్లను వలంటీర్లు నమోదు చేయగా అందులో 523 రకాల సర్వీసులను ఆమోదించినట్లు తెలిపారు. అందులో 256 ఆదాయ, 284 ఇంటిగ్రేటెడ్, 3 నూతన రేషన్‌కార్డుకోసం, 18 ఆధార్ సీడింగ్ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఎంపీపీ సుర్ణమ్మ, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నాగార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

**పగిడ్యాల:** స్థానిక గ్రామ సచివాలయం–2 ఆవరణంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 147 మంది వివిధ ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకోగా వారందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, మండల ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

### పడిగాపులు కాసే పరిస్థితి తప్పింది



సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంజూరు చేయడం ప్రశంసనీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అద్భుతమైనది. ఒక్క రోజులోనే ప్రజలు కోరిన కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ, ఆధార్ అనుసంధానం ధ్రువపత్రాలు మంజూరు కావడం సంతోషదాయకం.

– రమణప్రసాద్, పడమర ప్రాతకోట

### జగనన్న సురక్షతో ప్రయోజనం కలిగింది



జగన్న కార్యక్రమం వల్ల నాకు ఎంతో ప్రయోజనం కలిగింది. నా ఆధార్‌కు మొబైల్ నంబర్ సీడింగ్ ఉన్న ఊరులోనే చేయించుకో గలిగాను. లేకపోతే నందికొట్కూరు లేదా జూపాడు బంగ్లా వెళ్లాల్సి వచ్చేంది. దీని వల్ల నాకు ఒక రోజు సమయం వృథా అవ్వడమే కాకుండా డబ్బు కూడా ఖర్చు అయ్యేంది. ఈ కార్యక్రమం వల్ల సమయం, డబ్బు వృథా కాకుండా ఆధార్ లింక్ చేయించుకోగలిగాను.

– సుంకిరెడ్డి, రైతు, తర్తూరు

### సబ్సిడీ కందుల పంపిణీ

**మిడుతూరు:** మండలపరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తనాలను సర్పంచ్ చింతకుంట నాగస్వామిరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామ సచివాలయ పరిధిలో బైరాపురం, తిమ్మాపురం గ్రామాల్లోని రైతులకు 8 క్వింటాళ్ల 200 బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫరీద్ బాషా, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### కోలుకోలేక ఉపాధి కూలీ మృతి

**మహానంది:** అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న గాజులపల్లె గ్రామానికి చెందిన ఉపాధి కూలీ భూపని గురువయ్య(60) కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు ఏపీఓ మనోహర్ తెలిపారు. గురువయ్య గత నెల 26న ఉపాధి పనికి హాజరై అస్వస్థతకు గురయ్యాడని, చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. న్యూరో సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు.

### జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



బ్రాహ్మణకొట్కూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

**నందికొట్కూరు రూరల్ :** ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని జెడ్పీటీసీ కలిమున్నిసా బేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులో అధికారులు, మండల నాయకులు జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం 1050 మంది దరఖాస్తు చేసుకున్నారని వీరందరికీ అధికారులు, నాయకులు ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి, భూసర్వే డీటీ సత్యనారాయణ, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ మరియమ్మ, మండల ఇన్‌చ్యార్జ్ ఓంకార్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరిసర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### సారా ఊట ధ్వంసం

**మహానంది:** మహానంది సమీపంలోని నల్లమల అడవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలపై శనివారం మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది దాడులు నిర్వహించారు. 800లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మహానందికి చెందిన రాంభూపాల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## పోషకాహారంతో రక్తహీనత నివారణ

**మహానంది:** ఆకు, కాయగూరలతో పాటు నిత్యం వాడే పదార్థాల్లో పోషకాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. జాతీయ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన ఉద్యమం కార్యక్రమంలో భాగంగా శనివారం మహానందిలోని పోచా దార్మెటరీ భవనంలో గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, మహానంది సర్పంచ్ చలంచలం శిరీష , ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సికిల్ సెల్ అనీమియా నిర్మూలిద్దాం**

**కొత్తపల్లి :**ప్రతి ఒక్కరూ సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు వైద్యసిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారులు వినోద్ కుమార్, దీపా నాగవేణి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన కొత్తపల్లిలోని భ్రమరంబా గిరిజనగూడెంలో చెంచు చిన్నారులకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సి హెచ్ ఓ బాలకృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు

### కంటి చూపుపై నిర్లక్ష్యం వద్దు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**పాములపాడు:** కంటి చూపు విషయంలో నిర్లక్ష్యం చేయరాదని సర్పంచు నాయిని సావిత్రమ్మ అన్నారు. శనివారం మండలంలోని జూటూరు గ్రామంలో కర్నూలు శాంతి రాం వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వచ్చి ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వైద్యులు అశోక్‌కుమార్ 108 మందికి కంటి పరీక్షలు చేశారు. 25 మందికి శస్త్ర చికిత్స అవసరమని, కంటి పొర చికిత్స 20 మందికి అవసరమని, మిగతా వారికి కళ్లద్దాలు అవసరమని చెప్పారు. అవసరమైన వారికి ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటి, మధుసూదన్‌రావు,ఉపేంద్ర, వైద్య బృందం భరత్, రంజిత్, వెంకటేశ్వర్లు, మధు పాల్గొన్నారు.

## గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



నందిపల్లె లేఅవుట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న పీడీ భాస్కరనాయుడు

**మహానంది:** జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాస్కరనాయుడు కోరారు. నందిపల్లెలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 1,554 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 414 గృహాలు పూర్తయ్యాయని చెప్పారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, హౌసింగ్ ఏఈ వాసుదేవుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



రైతలకు కంది విత్తనాలను పంపిణీ చేసిన అధికారులు

**నందికొట్కూరు రూరల్ :** రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని యాగంటి పల్లి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని శాతనకోట, దామగట్ల, నాగటూరు, మండ్లెం రైతులకు కందిలో నూతన రకమైన టీఆర్–59 విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు భూసార ఆధారిత ఎరువులు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకె శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవి గౌడ్, రైతులు పాల్గొన్నారు.

**నాణ్యమైన విత్తనాలు వేసుకోవాలి**

**కొత్తపల్లి:** రైతులు అధికారుల సలహాల మేరకు నాణ్యమైన విత్తనాలు వేసుకోవాలని ప్రోగ్రామ్ కో–ఆర్డీనేటర్ డాక్టర్ ధనలక్ష్మి, శాస్త్ర వేత్తలు డాక్టర్ సుధాకర్, డాక్టర్ బాలరాజు, డాక్టర్ రవిగౌడ్‌సూచించారు. శనివారం మండల పరిధిలోని కొక్కెరంచ రైతుభరోసా కేంద్రంలో యాగంటీ కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. యాగంటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అపరాలు– సామూహిక ప్రదర్శన క్షేత్రాల్లో భాగంగా కంది రకం టీఆర్జీ 59 చిరు సంచులను రైతులకు పంపిణీ చేశామన్నారు. 30 ప్యాకెట్లను 15 మంది రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సహయకుడు అశోక్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

**పంటల బీమా మంజూరు**

**నందికొట్కూరు రూరల్ :** గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ప్రభుత్వం పంటల బీమాను మంజూరు చేసిందని మండల ఏఓ షేక్షావలి శనివారం తెలిపారు. మండలంలో 1381 మంది రైతులకు 1.27 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. బీమాకు సంబందించిన సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు.